క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి

ఐ.పోలవరం: ప్రైవేటు ఎలక్ట్రీషియన్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని మాణిక్యాంబ ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ సభ్యులు రాష్ట్ర యూనియన్‌కు విన్నవించుకొన్నారు. మురమళ్లలో శుక్రవారం జరిగిన యూనియన్ సమావేశానికి వచ్చిన రాష్ట్ర యూనియన్ అధ్యక్షుడు డీవీ సత్యనారాయణకు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్‌కు పరికరాల కొనుగోలుకు సబ్సిడీపై రూ.2 లక్షల రుణ సదుపాయం కల్పించాలని స్థానిక యూనియన్ నాయకులు కె.వెంకటేశ్వరావు, శీలం రమేష్, పి.అన్నవరం, లంక శ్రీధొర తదితరులు కోరారు.

జోరుగా అమృత్‌సరోవర్ పనులు

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి గ్రామంలో ప్రభుత్వం రూ.7.5 లక్షల నిధులతో ఎంపిక చేసిన అమృత్ సరోవర్ పనులు జోరుగా సాగుతున్నాయి. ఉపాధి కూలీలకు పని దినాలు కల్పించి గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న చెరువులను అభివృద్ధి చేయడానికి ఈ ప్రక్రియను అమల్లోకి తీసుకొచ్చింది. గొల్లవిల్లి గ్రామంలో జరుగుతున్న పనులను ఏపీవో వి.రాజామణి శుక్రవారం పరిశీలించి సిబ్బందికి సూచనలందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు జొన్నాడ చిన్ని, ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.ధనలక్ష్మి పాల్గొన్నారు.

శివన్నారాయణకు సత్కారం



శివన్నారాయణను సత్కరిస్తున్న గ్రామస్తులు

తాళ్లరేవు: ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన కుడుపూడి శివన్నారాయణను పి.మల్లవరం పంచాయతీ రాంజీనగర్ రామాలయం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ పెద్దలు పూలమాలలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా శివన్నారాయణ మాట్లాడుతూ పదవులు శాశ్వతం కాదని, మనం చేసే మంచి పనులే ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. శివన్నారాయణను సత్కరించిన వారిలో ఎంపీటీసీ సభ్యుడు దున్నా రాంబాబు, ఉపసర్పంచ్ పంపన రామకృష్ణ, పిల్లి వీరనాగు, యద్ల కుటుంబరావు, దున్నా శ్రీకాంత్, కావూరి బుజ్జి తదితరులున్నారు.

పైడేశ్వరరావుకు సేవా పురస్కారం

ముమ్మిడివరం: ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఓలేటి పైడేశ్వరరావుకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. గుంటూరు మార్కెటింగ్ శాఖ కమిషనర్ చేతుల మీదుగా శుక్రవారం ఈ అవార్డు అందుకున్నారు. మార్కెట్ ఫీజు నూటికి నూరుశాతం వసూలు చేయడమే కాకుండా విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచినందుకు అవార్డు అందుకున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిపూడి శివన్నారాయణ, డైరెక్టర్లు, కార్యాలయ సిబ్బంది ఆయనను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు గాయాలు

ముమ్మిడివరం: ముమ్మిడివరం ఎస్‌ఈబీ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న డేవిడ్ లివింగ్ స్టన్ శుక్రవారం విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళుతుండగా స్థానిక కాశివాని తూము సెంటర్‌లో వెనుక నుంచి వచ్చిన మరో మోటారుసైకిల్ ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై పడిపోయిన డేవిడ్ లివింగ్ స్టన్‌కు గాయాలవ్వడంతో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జన సురక్ష పథకాలపై అవగాహన సదస్సు

కాట్రేనికోన: కాట్రేనికోన మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రధానమంత్రి జనసురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి లీడ్ బ్యాంకు మేనేజర్ కె.లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రధానమంత్రి జనసురక్ష యోజన పథకానికి 18–70 ఏళ్ల వయసున్నవారు ఏడాదికి రూ.20 చొప్పున ప్రీమియం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంటి వెంకట సుధాకర్, ఏపీఎం వెంకటేశ్వర్లు, యూనియన్ బ్యాంక్ మేనేజర్ జీఎల్‌ఎస్‌సీ వర్మ పాల్గొన్నారు.

తాగునీరివ్వాలంటూ మహిళల నిరసన

అల్లవరం: డి.రావులపాలెంలోని 7, 3 వార్డుల ప్రజలకు తాగునీరివ్వాలంటూ సచివాలయ ఆవరణలో మహిళలు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. రంగా సెంటర్ నుంచి వంటెద్దు రామారావు ఇంటి వరకూ, శ్యామలాంబ చెరువు, కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఉన్న చెరువు చుట్టూ ఉన్న కుటుంబాలకు తాగునీరు రావడం లేదని వాపోయారు. కార్యక్రమంలో కొల్లా సూర్యకుమారి, గోళ్ల పద్మ, ఎ.మేరి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లరేవు: తాళ్లరేవు మాధవరాయునిపేట అంగన్‌వాడీ కేంద్రంలో సహాయకురాలు పోస్టు నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ వి.మాధవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై 21 నుంచి 35 ఏళ్ల వయసున్న ఓసీ కేటగిరీకి చెందిన వివాహిత మహిళా అభ్యర్థిని దరఖాస్తు చేసుకోవాచ్చన్నారు.

నోటిఫికేషన్ ఇచ్చారు.. భర్తీ మరిచారు..

- ఏళ్ల తరబడి భర్తీకి నోచుకోని లైబ్రేరియన్ పోస్టులు
- గ్రంథాలయాలపై పుదుచ్చేరి ప్రభుత్వ నిర్లక్ష్యం



యానాంలోని ప్రభుత్వ కేంద్ర గ్రంథాలయం

యానాం: సాధారణంగా ప్రభుత్వం ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్ ఇస్తే కనీసం ఆరు నెలలకో, ఏడాదికైనా ఆయా ఉద్యోగాల్ని భర్తీ చేస్తుందని నిరుద్యోగులు భావిస్తుంటారు.. కాని ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చి ఉద్యోగార్థులు ఆయా ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకుని ఎనిమిదేళ్లు, పదేళ్లు దాటినా ఉద్యోగాల్ని భర్తీ చేయకపోతే ఏమనుకోవాలి..? పుదుచ్చేరి ప్రభుత్వం 2012 సెప్టెంబర్‌లో డీఎస్‌ఈ ద్వారా స్కూల్ లైబ్రేరియన్ పోస్టులకు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆర్ట్ అండ్ కల్చర్ శాఖ 2015 డిసెంబర్‌లో లైబ్రేరియన్ పోస్టుల నియామకానికి నోటిఫికేషన్లు విడుదల చేసింది. ఇన్నేళ్లు గడిచినా భర్తీ ఊసే లేకపోవడంతో గ్రంథాలయాలపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందంటూ యానాంలో నిరుద్యోగులంతా మండి పడుతున్నారు.

యానాం నియోజకవర్గ పరిధిలోని పలు ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలు, వివిధ విద్యాసంస్థల్లోని గ్రంథాలయాల్లో ఏళ్ల తరబడి సిబ్బంది నియామకం లేకపోవడంతో పాఠకులకు, విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు కావాల్సిన సమాచారం అందే పరిస్థితి లేకుండా పోయింది. యానాంలో పుదుచ్చేరి ప్రభుత్వ కళలు, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలోని ప్రభుత్వ గ్రంథాలయం వందలాది మంది నిరుద్యోగులు, విద్యార్థులతో నిత్యం కిటకిటలాడుతుంటుంది. యానాం జనాభా 20,000 ఉన్నప్పుడే 4 సబ్ బ్రాంచ్‌లతో నడిచింది. ప్రస్తుతం యానాం జనాభా 60,000 చేరుకున్నా ఇక్కడ ఛీఫ్ లైబ్రేరియన్ పోస్టు, మూడు లైబ్రేరి అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్ పోస్టులు భర్తీని మాత్రం పట్టించుకునేవారు కరవయ్యారు. ఇలాంటి ఉదాహరణలు కోకొల్లలు..

ఇదీ పరిస్థితి

- స్టేట్ ఇన్ఫర్మేషన్ సెంటర్(రాష్ట్రీయ సమాచార కేంద్రం)లో పూర్తి స్థాయి లైబ్రేరియన్ నియామకం లేకపోవడంతో రోజువారి వేతనం పొందే కింది స్థాయి సిబ్బందితో నెట్టుకొస్తున్నారు.
- డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒక లైబ్రేరియన్, లైబ్రేరి అటెండర్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొటున్నారు.
- నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐ, అంబేద్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు ప్రారంభించినప్పటి నుంచి లైబ్రేరియన్ పోస్టులు భర్తీ చేయలేదు.
- టంగుటూరి ప్రకాశం పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒక పోస్టు, డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న కమలానెహ్రూ ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఒక పోస్టు ఏళ్లుగా ఖాళీగానే ఉన్నాయి.
- పెరుంతాలైవర్ కామరాజర్ ప్రభుత్వ హైస్కూల్ గిరియాంపేటలో ఒక పోస్టు, డాక్టర్ కేఆర్ నారాయణన్ ప్రభుత్వ హైస్కూల్, దరియాలతిప్ప, పరంపేటలో అంబేడ్కర్ గవర్నమెంట్ హైస్కూల్, ఎంజీజీబీహెచ్ స్కూల్, సీబీఎస్ స్కూళ్లలో ఒక్కో పోస్టు చొప్పున ఖాళీలున్నాయి.

> **నియామకాలు జరిగేలా చూస్తా**
>
> 
>
> యానాం పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటాను. పుదుచ్చేరిలో సంబంధిత మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన నియామకం జరిగేలా చూస్తాను.
>
> – గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఎమ్మెల్యే, యానాం

ఎన్నో వినతి పత్రాలు

లైబ్రేరియన్ పోస్టులు భర్తీ చేయాలంటూ హయ్యర్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌కు, డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు, ఆర్ట్ అండ్ కల్చర్ శాఖకు నిరుద్యోగులు, స్థానికులు అనేక వినతి పత్రాలు ఇచ్చారు. అయినా అధికారులు పట్టించుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నోటిఫికేషన్ ఇచ్చి పదేళ్లైనా పోస్టులు భర్తీ చేయకపోవడం ఎక్కడా ఉండదంటూ మండిపడుతున్నారు. గతంలో యానాం వచ్చిన అప్పటి హయ్యర్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌లు వైఎల్ఎన్ రెడ్డి, రుద్రగౌడలకు వినతి పత్రాలిస్తే నెల రోజుల్లో పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి అదీ మరిచిపోయారంటూ నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రహదారుల నాణ్యతపై తనిఖీలు



గ్రామీణ రహదారుల నాణ్యతను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ ఈఈ ప్రసాద్ తదితరులు

అల్లవరం: విశాఖపట్నం క్వాలిటీ కంట్రోల్ ఈఈ వీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో అమలాపురం రూరల్ పరిధిలోని గ్రామీణ రహదారుల నాణ్యతను శుక్రవారం పరిశీలించారు. కామనగరువు ప్రధాన రహదారి నుంచి పసిడిచెరువు వరకూ రూ.1 కోటి వ్యయంతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు, సవరప్పాలెం గ్రామంలో రింగురోడ్డు రూ.1.6 కోట్ల నిధులతో చేపట్టిన బీటీ రోడ్డు, భట్నవల్లి జాతీయ రహదారి నుంచి చినవీధి మీదుగా రూ.1 కోటి వ్యయంతో నిర్మిస్తున్న బీటీ రోడ్లను క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీలు నిర్వహించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈఈ వెంట క్వాలిటీ కంట్రోల్ డీఈఈ సురేష్, డీఈఈ అన్యం రాంబాబు, ఏఈఈ శేషయ్య, గలీబ్ అహ్మద్ తదితరులు ఉన్నారు.

గ్రామీణ రహదారుల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్



రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

తాళ్లరేవు: గ్రామీణ ప్రాంత రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని చొల్లంగి, పోలేకుర్రు పంచాయతీల్లో రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులతో చొల్లంగి పంచాయతీ యాదవపేటలో రూ.15 లక్షలతో, పోలేకుర్రు పంచాయతీ తోటపేట గ్రామంలో రూ.28 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే పొన్నాడ శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, ఎంపీటీసీ సభ్యురాలు బళ్ల సంధ్యారాణి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ ఎంసెట్, నీట్ పరీక్షల పోస్టర్ల విడుదల



మోడల్ ఎంసెట్, నీట్ మోడల్ పరీక్షల పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

అమలాపురం టౌన్: భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి మే 5వ తేదీ వరకూ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా నిర్వహించే మోడల్ ఎంసెట్, నీట్ పరీక్షల పోస్టర్లను ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు స్థానిక విద్యుత్ నగర్‌లో శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎంసెట్, నీట్ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ఎఫ్ఐ సేవలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ గుంజు మదన్, కో కన్వీనర్ బి.గౌతమ్, ప్రతినిధులు కె.శంకర్, టి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలతో నిరుపేదల కుటుంబాల్లో వెలుగులు

గడప గడపకూ కార్యక్రమంలో మంత్రి తనయుడు శ్రీకాంత్



సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారునితో మాట్లాడుతున్న మంత్రి తనయుడు శ్రీకాంత్

అల్లవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో నిరుపేదల కుటుంబాల్లో వెలుగులు నిండుతున్నాయని మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ అన్నారు. ఎస్.పల్లిపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు అమలుచేస్తున్న ఏకైక ప్రభుత్వమిదన్నారు. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ తాగునీరు సరఫరా చేసేందుకు ఓహెచ్ఆర్ ట్యాంక్‌ల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు. ప్రభుత్వం అర్హులందరికీ గృహ రుణాలిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, గృహ సారథుల కన్వీనర్ టి.ప్రసాద్, సొసైటీ చైర్మన్ యల్లమిల్లి బోసు, సర్పంచ్ కొల్లు వెంకటరమణ, సుందరనీడి సాయికృష్ణ, రాకాపు విజయలక్ష్మి, తిక్కిరెడ్డి శ్రీను, ఎంపీటీసీలు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, మాకే కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ పొందిన అభ్యర్థులతో ఎంవీఐ రవికుమార్, డీఎం, అధికారులు

అమలాపురం రూరల్: ఆర్టీసీ డిపోలో హెవీ డ్రైవింగ్ స్కూల్ ద్వారా అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) రవికుమార్ అన్నారు. ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ ద్వారా ఆరో బ్యాచ్‌లో 32 రోజుల శిక్షణ పొందిన 16 మంది అభ్యర్థులకు శుక్రవారం ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా డిపోలో జరిగిన సమావేశంలో డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, ఆర్టీసీ శిక్షణ కళాశాలలో డ్రైవర్లకు ప్రాక్టికల్ శిక్షణతో పాటు వాహన మెయింటెనెన్స్‌పై అవగాహన కల్పిస్తామని చెప్పారు. మే రెండో వారంలో ఏడో బ్యాచ్ శిక్షణ ప్రారంభిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ రజాక్‌ను 73829 09588 సెల్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మెకానికల్ అసిస్టెంట్ ఇంజినీర్ దేవి, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) ప్రతిమా కుమారి, సెక్యూరిటీ ఎస్సై రామారావు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో సామాజిక తనిఖీ చేపట్టండి

ముమ్మిడివరం: పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో సామాజిక తనిఖీ నిర్వహించాలని ఎంఈఓ బొజ్జా రమణశ్రీ సూచించారు. స్థానిక ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల సమావేశ మందిరంలో శుక్రవారం ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం మండలాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. అందరి భాగస్వామ్యంతో పాఠశాల భౌతిక వనరులు, పరిసరాల పరిశుభ్రత, తరగతి గదులు, ఫర్నీచర్, తాగునీరు, విద్యుత్, ఫైర్ సేఫ్టీ సౌకర్యాలు పరిశీలించాలన్నారు. వసతి గృహాల్లో భోజనం, జగనన్న విద్యా కానుక, బోధనా అభ్యాసన సామగ్రి, ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు అందించే సౌకర్యాలు తదితర అంశాలపై సామాజిక తనిఖీ నిర్వహించాలని ఆర్‌పీలు సీహెచ్ వీబీ నందం, జేకే రామలింగేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావులు సూచించారు. కార్యక్రమంలో సీఎంఓ సుబ్రమణ్యం, ఏపీఓ బీమారావు, ఏఏఎంఓ మొహినుద్దీన్ పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంఈవో కె.కిరణ్‌బాబు అధ్యక్షతన ప్రధానోపాధ్యాయులకు శుక్రవారం సోషల్ ఆడిట్‌పై ఒక రోజు శిక్షణా కార్యాక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు సీహెచ్‌వీఎస్ కృష్ణమూర్తి, బీఎస్ఎస్‌పీ రాజు, బి.జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ వచన కావ్య పుస్తకావిష్కరణ



డొక్కా సీతమ్మ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ నానిరాజు

అమలాపురం టౌన్: స్థానిక కూచిమంచివారి అగ్రహారంలో సాయి సంజీవిని వాకర్స్ యోగ ఆరోగ్య సేవా సంస్థ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన అమలాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, అంతర్జాతీయ వాకర్స్ ఏరియా కోఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డిలు సీతమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అమలాపురానికి చెందిన కవి నల్లా నరసింహమూర్తి రచించిన డొక్కా సీతమ్మ వచన కావ్యం ద్వితీయ ముద్రణ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రుద్రరాజు నానిరాజు మాట్లాడుతూ డొక్కా సీతమ్మ పేరు తలవగానే ఆంధ్రుల సేవా గుణం ప్రపంచ దేశాలకు తెలుస్తుందన్నారు. అనంతరం కవి సమ్మేళనం నిర్వహించారు. అమలాపురం ఏజీఎం కాలనీలో తల్లి మృతితో విలపిస్తున్న మన్నే ప్రమీల, సత్య హర్షిత అనే బాలికల చదువు ఖర్చుల నిమిత్తం కొంత నగదును పోస్టల్ ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆ పత్రాలను వాకర్స్ కో ఆర్డినేటర్ సత్యనారాయణరెడ్డి, స్థానిక సర్ సీవీ రామన్ స్కూలు డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు, కొప్పిశెట్టి నాగేశ్వరరావు, సత్యనారాయణలు చిన్నారులకు అందజేశారు.

డొక్కా సీతమ్మకు 'కోనసీమ ఆహార నిధి' నివాళి

అమలాపురం టౌన్: స్థానిక విద్యానిధి విద్యా సంస్థల ప్రాంగణంలో కోనసీమ ఆహార నిధి సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. తొలుత డొక్కా సీతమ్మ చిత్రపటానికి కోనసీమ ఆహార నిధి అధ్యక్షుడు వీరంశెట్టి సతీష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆహార నిధి గౌరవ సలహాదారు యాళ్ల వర ప్రసాద్, విద్యానిధి విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు, సురేష్, ఆర్‌కే నాయుడు, కిరణ్ చీకట్ల తదితరులు పాల్గొన్నారు.



హరిమనోవికాస కేంద్రం పాఠశాలకు పండ్లు, నిత్యావసరాలు అందజేస్తున్న విశ్వనాథ్

అమలాపురం రూరల్: ఇందుపల్లి ఆరవగరువు బాల భక్త గణపతి సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం డొక్కా సీతమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు టీకే విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఈదరపల్లిలోని హరి మనోవికాస కేంద్రం మానసిక వికలాంగ పిల్లలకు పండ్లు, నిత్యావసరాలు అందజేశారు. భూపయ్య అగ్రహారం లూయీ అంధుల పాఠశాల విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పేరి రామకృష్ణ, టీఎస్ఎస్ఎస్ శర్మ, శిష్ట సుందర రామయ్య, అజిత్ శర్మలు పాల్గొన్నారు.

సత్యనారాయణ సేవలు ప్రశంసనీయం

యానాం: యానాం కోస్టల్ పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ జనిపల్లి సత్యనారాయణ సేవలు ప్రశంసనీయమని పలువురు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఉద్యోగ విరమణ సందర్భంగా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సహచర పోలీస్ సిబ్బంది ఘనంగా సత్కరించారు. 33 ఏళ్ల పాటు నిజాయితీగా సేవలందించారని ఆయనను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రఘునాయగం, సీఐ షణ్ముగం, ఎస్‌హెచ్‌ఓ శేరు నూకరాజు, పీసీఆర్ సెల్ ఎస్ఐ కట్టా సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా సేవలందించిన జి.వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ సభను ఆసుపత్రి సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను డీడీ డాక్టర్ టి.రవిశంకర్, పలువురు దుశ్శాలువాలతో సత్కరించారు.

కానిస్టేబుళ్లకు రేడియో ఆపరేటర్‌గా పోస్టింగ్

యానాం: పుదుచ్చేరివ్యాప్తంగా పలువురు పోలీస్ కానిస్టేబుళ్లను వైర్‌లెస్ విభాగంలో రేడియో ఆపరేటర్స్, రేడియో టెలిఫోనీ పీసీలుగా మార్పు చేస్తూ శుక్రవారం పోలీస్‌శాఖ ప్రత్యేక అధికారి ఎస్.కుబేర శివకుమరన్ ఆదేశాలు జారీచేశారు. యానాం పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ అరిశెట్టి గణేష్‌ను రేడియోఆపరేటర్‌గా మార్పు చేస్తూ పీఆర్‌బీ యానాంకు, కోస్టల్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ కె.గంగరాజును రేడియో టెలిఫోనీ పీసీగా మార్పు చేసి పీఆర్‌బీ యానాంలో పోస్టింగ్ ఇచ్చారు.

మహిళా ఉద్యోగులకు సమయవేళల్లో సడలింపు

యానాం: ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగుల సంక్షేమార్థం పుదుచ్చేరి ప్రభుత్వం హాజరులో ప్రత్యేక పర్మిషన్ ఇస్తూ శుక్రవారం నిర్ణయం తీసుకుంది. నెలలో మూడు శుక్రవారాల్లో ఇంటి వద్ద పూజలు నిర్వహించుకునేందుకు వీలుగా ఉదయం 8.45 గంటల నుంచి 10.45 గంటల వరకూ రెండు గంటల పాటు ప్రత్యేక పర్మిషన్ ఇస్తూ ఎల్జీ తమిళిసై సౌందరాజన్ ఆమోదం తెలిపారు. హాస్పటల్స్, పోలీస్‌స్టేషన్స్, విద్యాసంస్థలు, అత్యవసర విభాగాల్లో ఉన్నవారికి ఈ పర్మిషన్ వర్తించదని స్పష్టం చేశారు.

గర్భిణులకు సీమంతం

ఉప్పలగుప్తం: గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే శిశువు ఆరోగ్యంగా జన్మిస్తుందని సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ సూచించారు. మండలంలోని గొల్లవిల్లి పంచాయితీ పరిధి వాడపర్రు–2 అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం గర్భిణులకు శ్రీదుర్గ సీమంతం చేసి పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఎల్.సిరిలక్ష్మి, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి విశ్వరూప్‌ను కలిసిన ఎమ్మెల్సీ వెంకటరమణ



ఎమ్మెల్సీ వెంకటరమణను సత్కరిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: అమలాపురంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన కైకలూరు నియోజకవర్గానికి చెందిన జయమంగళ వెంకటరమణ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెంకటరమణను మంత్రి విశ్వరూప్ పుష్పగుచ్ఛంతో సత్కరించారు. స్థానిక శెట్టిబలిజ గ్రంథాలయంలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావును ఎమ్మెల్సీ వెంకటరమణ కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ని ఎమ్మెల్సీ కుడుపూడి సత్కరించారు. కార్యక్రమాల్లో తుని నియోజకవర్గ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, దొమ్మేటి రాము తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ దుర్గాశేఖర్ రెడ్డి

అమలాపురం రూరల్: రహదారి భద్రతపై డ్రైవర్లు అవగాహన పెంచుకోవాలని పట్టణ సీఐ దుర్గాశేఖర్ రెడ్డి అన్నారు. రోడ్ సేఫ్టీ అవగాహన సదస్సులో భాగంగా శుక్రవారం సాయంత్రం పట్టణ సీఐ దుర్గాశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈదరపల్లి లారీ యూనియన్ ఆఫీసులో లారీ యూనియన్, పట్టణ ఆటో యూనియన్ కార్యవర్గ సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ దుర్గాశేఖర్ రెడ్డి మాట్లాడుతూ డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ట్రాఫిక్ రూల్స్‌తో పాటు దూర ప్రయాణాల్లో పేస్ వాష్ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐలు పీఎస్‌వీఎస్ రాజు, ఎఎస్ఐ విక్రంసేన్, హెచ్‌సీ ఆనంద్, లారీ యూనియన్ అధ్యక్షుడు రాంబాబు, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.